
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 26 మే 2025

పోలవరం గట్టు గుట్టు.. గప్‌చుప్!

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పోలవరం మట్టి తవ్వకాల్లో గుట్టు తేలట్లేదు. 2.02 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వగా, ప్రభుత్వ అవసరాలకు 28.88 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుకోవటానికి అనుమతించారు. ఇంకా 1.74 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి ఉండాల్సి ఉండగా, వాటి లెక్కలు తేలట్లేదు. పోలవరం కాల్వగట్టు తవ్వినపుడు మట్టి ఎంత వచ్చింది? ప్రభుత్వ అవసరాలకు అధికారికంగా తవ్వకాలకు ఎంత అనుమతించింది? వివరాలు రికార్డుల్లో ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు మాత్రం అధికారికంగా ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు? మరి మట్టి గుట్టలు ఎలా కరిగిపోయాయి? ఎవరు కరిగించుకుపోయారన్నది తెలియదట. ఇదీ ఘనత వహించిన జలవనరుల శాఖ అధికారుల నిర్వాకం. ప్రభుత్వ అవసరాలకు ఇచ్చింది పోను క్షేత్రస్థాయిలో ఇంకా ఎంత మట్టి ఉందంటే, ముళ్ల కంపలు పెరిగిపోవటం వల్ల అంచనా వేయలేకపోతున్నామని చెబుతున్నారు. ముళ్ల కంపలు ఉంటే మట్టి గుట్టలను అంచనా వేయలేరా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.



1.74 కోట్ల క్యూబిక్ మీటర్ల పోలవరం మట్టి ఏమైంది?

మట్టి ఎంత ఉందో తెలియదని అధికారుల దాటవేత

- సమాచార హక్కు దరఖాస్తుకు ఇరిగేషన్ అధికారుల స్పందన
- విజిలెన్స్ విభాగానికి కూడా కట్టుకథలతో లెక్కలు చెప్పారా?
- పోలవరం కుడిగట్టులో మొత్తం 2.02 కోట్ల క్యూబిక్ మీటర్ల నిల్వలు
- ప్రభుత్వ అవసరాల కోసం ఇచ్చింది 28.89 లక్షల క్యూబిక్ మీటర్లు
- మిగిలిన మట్టి ఏమైంది అనే ప్రశ్నకు సమాధానం లేదు..



పోలవరం కాల్వ గట్టుపై తవ్వకాలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పోలవరం కుడికాల్వపై ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్ మాఫియా గుట్టలను కరిగించేసి చదును చేసేసింది. గన్నవరం, నున్న, విజయవాడ, వెలగలేరు సబ్ డివిజన్ల పరిధిలో అడ్డగోలుగా ఈ తవ్వకాలు జరిగాయి. అప్పటి అక్రమ మట్టి తవ్వకాలకు జలవనరుల శాఖ అధికారులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలవరం మట్టి తవ్వకాలకు సంబంధించి ఇటీవల విజిలెన్స్ అధికారులు తనిఖీలు జరిపారు. ఇరిగేషన్ అధికారులను వివరణ కోరారు. గతంలో జరిగిన అక్రమాల పాపంలో తాము కూడా భాగస్వాములుగా ఉండటంతో ఇరిగేషన్ అధికారుల వెన్నులో వణుకు పుడుతోంది. దీంతో వాస్తవాలను దాచేస్తున్నారు. విజిలెన్స్‌కు కూడా అరకొర సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. సమాచార హక్కు చట్టం కింద అడిగిన వారికి కూడా అక్రమ తవ్వకాలపై కనీస సమాచారం ఇవ్వట్లేదు. దీంతో జలవనరుల శాఖ అధికారుల వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. గన్నవరంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుయాయులు సాగించిన పోలవరం మట్టి దందాను ఏమీ లేదన్నట్టుగా తేల్చేస్తున్నారు. విజయవాడ రూరల్ మండలానికి చెందిన మెండెం జమలయ్య సమాచార హక్కు చట్టం ద్వారా సంధించిన ప్రశ్నలకు ఇరిగేషన్ అధికారులకు వాస్తవాలను దాచేసి అరకొర సమాచారం ఇచ్చారు.

మిగిలిన మట్టి ఏమైంది?

ఇరిగేషన్ శాఖ అధికారులు కేవలం ప్రభుత్వ శాఖల అవసరాలకు మట్టి ఇచ్చామని చెబుతున్న నేపథ్యంలో గన్నవరం, నున్న, విజయవాడ, వెలగలేరు సబ్ డివిజన్ల పరిధిలో 1.74 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి నిల్వలు ఉండాలి. ఇందులో ఎంత మట్టి ఉందో అధికారులు చెప్పట్లేదు. అదేమంటే మట్టి మీద కంప పెరిగింద, కుదరట్లేదని సమాధానం ఇస్తున్నారు.

గన్నవరంలో కరిగించేసిన మట్టి ఎంత?

గన్నవరం నియోజకవర్గ పరిధిలో పోలవరం కాల్వ గట్టును పెద్ద ఎత్తున మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుయాయులు మిగతా 6లో..

రైతులు ఆక్రమించుకున్న వాటికి ఫిర్యాదులు చేశారట

పోలవరం కుడి కాల్వ గట్టు వెంబడి నిల్వ ఉంచిన మట్టి నిల్వలు ఏమైపోయాయో తెలియదు కానీ, కాల్వను ఆనుకుని ఉన్న భూ యజమానులు కాల్వల వెలుపల స్పాయిల్ బ్యాంకులు ఖాళీ ఉన్నచోట్ల కొన్ని ప్రదేశాల్లో నున్న సబ్ డివిజన్ పరిధిలో గొల్లనపల్లి, ముదిరాజుపాలెం, గోపవరపుగూడెం, సూరంపల్లి, నున్న గ్రామాల పరిధిలో మామిడి మొక్కలు నాటారని వాటిని ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు ఇచ్చామని చెప్పారు. విజయవాడ సబ్ డివిజన్ పరిధిలో కూడా నున్న, పాతపాడు, పీ నైనవరం, జక్కంపూడి గ్రామాల్లోని కొన్ని ప్రదేశాలలో పై విధంగానే ఆక్రమణలు జరిగాయని తెలిపారు. ఈ విషయాలు తెలిసిన అధికారులకు మిగిలిన మట్టి నిల్వలు ఏమైపోయాయో తెలియకపోవటం గమనార్హం.

ఈ ఏడాది రోహిణి లేనట్టే..!

నెలాఖరు వరకు వరుసగా వర్షాలు

మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు

ప్రజలకు ముందస్తు ఉపశమనం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వేసవి ఉష్ణోగ్రతల నమోదులో అందరికి ముందుగా గుర్తుకు వచ్చేది రెంటచింతల. ఆ తర్వాత టక్కున చెప్పే పేరు విజయవాడ. ఎండాకాలంలో అన్ని ప్రాంతాలు మండిపోతుంటాయి. కాకపోతే ఈ రెండు ప్రాంతాల్లో మంటలు అన్నింటి కంటే ఎక్కువగా ఉంటాయి. వేసవికాలం రోజులు అడుగు పెట్టడానికి ముందు నుంచి ఉమ్మడి జిల్లాకు సెగ తగులుతుంది. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లా కేంద్రంగా ఉండే విజయవాడ ప్రజలను ఇది ఎక్కువగా తాకుతుంది. సాధారణ రోజుల్లోనే విజయవాడలో ఎండలు కాస్త ఎక్కువగా ఉంటాయి. అదే వేసవిలో నమోదయ్యే ఉష్ణోగ్రతలకు ప్రజలు అల్లాడిపోతుంటారు. ఇక రోహిణి కార్తె ప్రారంభమైతే జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి గడగడలాడిపోతుంటారు. ప్రతి ఏడాది ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలకు ఇది తప్పని పరిస్థితి. ఈ ఏడాది మాత్రం జిల్లాకు ముందస్తు ఉపశమనం లభించింది. రోహిణి కార్తె మొదలయ్యే రోజు నుంచి అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఇప్పుడు రోహిణి వచ్చిన నాటి నుంచి జిల్లా ప్రజలను చల్లదనంతో చినుకులు పలకరించాయి. ఈ వర్షాల పరంపర జూన్ వరకు మిగతా 6లో..

గాలుల దిశ మారుతోంది

వేసవిలో ఉత్తర, పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తాయి. ఈ గాలులు రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతం నుంచి వస్తాయి. దీనివల్ల మనకు వేడి ఎక్కువగా ఉంటుంది. జూన్ నెలలో ఈ గాలుల స్థానంలో దక్షిణ, పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తాయి. వాటి వల్ల వాతావరణంలో చల్లదనం చేరుతుంది. ఈ ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయి. సాధారణంగా జూన్‌లో వస్తాయని అంచనా వేసిన రుతు పవనాలు ఈసారి ముందుగానే తెలుగుగడ్డను తాకుతున్నాయి. రుతు పవనాలు వచ్చినప్పుడు ఎలాగూ వర్షాలు కురుస్తాయి. దీనికి ముందు బంగాళాఖాతం, అరేబియ సముద్ర గర్భంలో ఏర్పడిన అల్పపీడనంతో కొన్ని రోజులపాటు వరుసగా ప్రతిరోజు వర్షాలు కురుస్తాయి.

- కె.సత్యనారాయణ, వాతావరణ నిపుణుడు

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

- ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు
- అనాసాగరం వద్ద జాతీయ రహదారిపై ఘటన
- బాధితులు పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ వాసులు

6లో

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

6లో

49 మంది విద్యార్థులకు రెండో సెక్షన్ అమలు చేయాలి

- డీఈవోకు యూటీఎఫ్ నేతల వినతి

టీడీపీ పండుగకు వేళాయె!

ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 20 వేల మంది పయనం

- ఒక్కో నియోజకవర్గం నుంచి 2 వేల మంది కార్యకర్తలు, 500 మంది నాయకులు
- ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రతిపాదనతో రెండు జిల్లాల అధ్యక్షులు నెట్టెం, కొనకళ్ల
- కడపలో 27 నుంచి టీడీపీ రాష్ట్ర మహానాడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కడపలో ఈ నెల 27 నుంచి జరిగే రాష్ట్రస్థాయి టీడీపీ మహానాడుకు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 20 వేల మంది కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లనున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి రెండు వేల మంది కార్యకర్తలు, 500 మంది నాయకులు బయలుదేరుతున్నారు. మండల, జిల్లా నాయకత్వాలతో సహా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి మొత్తం 20 వేల మంది వెళ్తున్నట్టు సమాచారం. ఇప్పటికే కార్లు, బస్సులు బుక్ చేసుకున్నట్టు తెలిసింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా లేకుండా కార్యకర్తలు, నాయకులు కృషి చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్న మహానాడు కావడంతో అనేక మిగతా 6లో..

జెడ్పీ బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు

ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇష్టానుసారంగా చేర్పులు, మార్పులు

కౌన్సెలింగ్ లేకుండా బదిలీలు అంటూ సంకేతాలు

ముగిసిన దరఖాస్తు స్వీకరణ గడువు

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో, ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు

లభించని భరోసా.. వెంటాడుతున్న బదిలీల భయం



జెడ్పీ కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీలపై పంచాయతీరాజ్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ నెల 22వ తేదీన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తూ రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకునే వారికి వెసులుబాటు కల్పించారు. వివిధ యూనియన్‌లలో ఆఫీస్ బేరర్లుగా పనిచేస్తున్న వారికి, ఐదు నెలల్లోపు పదవీ విరమణ చేసేవారికి, అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడేవారికి బదిలీల నుంచి మినహాయింపును ఇచ్చారు. బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో నిర్వహించి, ఖాళీలు ఉన్న ప్రాంతాల్లో ఉద్యోగులు తమకు ఇష్టమైన ప్రాంతాన్ని కోరుకుంటే, అక్కడకు బదిలీ అయ్యే అవకాశం కల్పించారు. దీంతో పాటు ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను ఉల్లంఘిస్తే జెడ్పీ సీఈవోనే బాధ్యత వహించాల్సి ఉంటుందని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో కీలకమైన పాయింట్‌లను తొలగించిన జిల్లాపరిషత్ అధికారులు తమ చిత్తానుసారంగా ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మిగతా 6లో..

ప్రభుత్వం అన్ని విభాగాల ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విధివిధానాలను విడుదల చేసింది. అయితే ఏ శాఖలో లేని విధంగా జిల్లా పరిషత్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇష్టానుసారంగా చేర్పులు, మార్పులు చేసి బదిలీలు చేస్తామని ఆ శాఖ అధికారులు చెబుతుండటంతో ఆ విభాగంలోని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారంతో ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల ప్రకారం బదిలీలు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలసి విజ్ఞప్తి చేస్తే, ఈ విషయంపై తన వద్దకు రావద్దని, కొద్దిపాటి మార్పులతో బదిలీలు జరుగుతాయని చెప్పడంతో ఉద్యోగులు కంగుతిన్నారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో, ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలిసినా భరోసా లభించకపోవడంతో ఉద్యోగులను బదిలీల భయం వెంటాడుతోంది.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ముగిసిన యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పేపర్-1కు 5,176 (55.1 శాతం), పేపర్-2కు 5,665 (54.6 శాతం) అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూం ద్వారా పరీక్ష నిర్వహణను పర్యవేక్షించామన్నారు. అభ్యర్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా పరీక్ష నిర్వహించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.



కృష్ణాజిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

మచిలీపట్నం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలపై విజయవాడలో జూన్ 5న జరగనున్న విస్తృత సమావేశంలో చర్చిస్తామని కృష్ణాజిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షుడు పి.రాము అన్నారు. మచిలీపట్నం జి కన్వెన్షన్ హాలులో ఆదివారం జిల్లా ఉద్యోగుల సంఘ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జి.నాగసాయి ఎన్నికల అధికారిగా, కిశోర్ సహాయ అధికారిగా వ్యవహరించారు. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో సహ అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా తోట వరప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.రాంబాబు, ఉపాధ్యక్షుడిగా కెఎల్.లోకేశ్వరరావు, ఎస్‌వివి రామారావు, సీహెచ్‌వి సత్యనారాయణరావు, వి.సత్యనారాయణ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా జి.రామకృష్ణ, పవన్‌కుమార్ సీహెచ్ బ్రహ్మానందబాబు, బాలాజీ, ప్రవీణ్‌కుమార్, హుస్సేన్, ఎండి సలీం, కోశాధికారిగా సురేష్‌నాయక్ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పి.రాము మాట్లాడుతూ, జూన్ 5న జరిగే చలో విజయవాడ కార్యక్రమంలో పది వేలమంది ఉద్యోగులు పాల్గొంటారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

మహానాడుకు తరలిరండి..

» అభిమానులు, పార్టీశ్రేణులకు ప్రత్యేక ఏర్పాట్లు

అవనిగడ్డ, మే 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం నుంచి మహానాడుకు తరలివెళ్లే కార్యకర్తలు, అభిమానుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు స్థానిక టీడీపీ నేతలు బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, కర్రా సుధాకర్, పరుచూరి దుర్గా ప్రసాద్‌లు తెలిపారు. ఆదివారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడుతూ, మహానాడుకు పార్టీ శ్రేణులు తరలివెళ్లేందుకు సోమవారం మధ్యాహ్నం అవనిగడ్డ నుంచి లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంచుతున్నామని, అదేవిధంగా 29న జరిగే బహిరంగ సభ కోసం నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. మహానాడుకు వెళ్లే పార్టీ కార్యకర్తలు, అభిమానులు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గానీ, మండల అధ్యక్షులు, నేతలను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి అదనంగా బస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నేతలు పరిశె చలపతి, మేడికొండ విజయ్, తలశిల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

49 మంది విద్యార్థులకు రెండో సెక్షన్ అమలు చేయాలి

» డీఈవోకు యూటీఎఫ్ నేతల వినతి

మచిలీపట్నం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత పాఠశాలల్లో 49 మంది విద్యార్థులుంటే రెండో సెక్షన్ అమలుచేయాలని డీఈవో రామారావును యూటీఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు డీఈవోకు ఆదివారం వారు వినతిపత్రం సమర్పించారు. నేతలు కేఏ ఉమామహేశ్వరరావు, జె.లెనిన్‌బాబు, ఎండీ షౌకత్ హుస్సేన్, బి.కనకారావు, జె.యూన్సీ డీఈవోతో చర్చలు జరిపారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల ముఖ్య కార్యదర్శితో జరిగిన చర్చల్లో 54 మంది విద్యార్థులు కాకుండా 49 మంది ఉంటే రెండో సెక్షన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీని అమలు చేయాలన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ అనంతరం జిల్లాలో కేడర్ వారీగా స్ట్రెంత్‌ను తెలియజేసి ప్రమోషన్లు ఇవ్వాలని, ఖాళీ పోస్టుల వివరాలను ప్రకటించాలన్నారు. సర్‌ప్లస్ ఉపాధ్యాయుల సంఖ్య తెలియజేయాలన్నారు.

సీనియారిటీ జాబితాలు వెబ్‌సైట్‌లో : డీఈవో

ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించనున్న దృష్ట్యా సీనియారిటీ జాబితాలను వెబ్‌సైట్‌లో, మచిలీపట్నం కార్యాలయంలోని నోటీసు బోర్డులో అందుబాటులో ఉన్నాయని డీఈవో రామారావు తెలిపారు. సీనియారిటీ జాబితాల్లోని ప్రధానోపాధ్యాయులు సోమవారం ఉదయం 10 గంటలకు మచిలీపట్నం లేడీయాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల ఫోటోస్టాట్ కాపీలు, సర్వీసు రిజిష్టర్‌ను తీసుకురావాలన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనలో క్రీడా సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలి

లబ్బీపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా భర్తీలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలనలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) అధికారులతో పాటు క్రీడా సంఘాలనూ భాగస్వామ్యం చేయాలని ఏపీ ఒలింపిక్ సంఘం 10వ వార్షిక సర్వసభ్య సమావేశం తీర్మానించింది. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ఏపీవోఏ వార్షిక సర్వసభ్య సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కె.పురుషోత్తం మాట్లాడుతూ, క్రీడాసంఘాల ప్రతినిధులు లేకుండా సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తే నకిలీలను గుర్తించడం కష్టతరమవుతుందని, గతంలో క్రీడాసంఘాల భాగస్వామ్యం లేకుండా స్పోర్ట్స్ కోటాలో వందలాదిమంది నకిలీ సర్టిఫికెట్లతో సచివాలయ ఉద్యోగాలు పొందారని ఆరోపించారు. సమావేశంలో 38 క్రీడా సంఘాల రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు. జూన్ 23న అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒలింపిక్ రన్‌లను నిర్వహించాలని తీర్మానించారు.

నైతికతకు కవులు నడుం బిగించాలి

» ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితరులు

విజయవాడ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నైతికతను కవులు భుజాని కెత్తుకోవాల్సిన అవసరం వుందని ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్వర్యంలో ఆదివారం ఉదయం గవర్నరుపేట బాలోత్సవ భవన్‌లో బంగార్రాజు కంఠ రచించిన 'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. సభకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ఒక లైక్ కోసం జీవితాల్ని కోల్పోతున్న ప్రమాదకరమైన వాతావరణంలో మనం జీవిస్తున్నామన్నారు. ఇలాంటి సమయంలోనే కవులు ఉమ్మడిగా గెంతాలన్నారు. కవులకు ఏ విషయాన్నయినా కవిత్వం చేసే హక్కు వుందన్నారు. కవుల్ని ఎవరూ శాసించవద్దన్నారు. సభకు అధ్యక్షత వహించిన బిక్కి కృష్ణ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా క్రమశిక్షణ లేదన్నారు. సినీ గేయరచయిత రసరాజు మాట్లాడుతూ, కవికి సొంత డిక్షన్ కావాలన్నారు. సుప్రసిద్ధ కవయిత్రి, విమర్శకురాలు ఘంటసాల నిర్మల మాట్లాడుతూ, స్త్రీలను గౌరవించడం గొప్ప సంస్కృతి అన్నారు. సమాజంలో ప్రతిచోట స్త్రీలపై జరుగుతున్న వివక్షాపూరిత మానసిక మారణకాండను కవులు నిరసించాలన్నారు. ప్రసిద్ధ కవి, విశ్లేషకులు కావ్య విశ్లేషణ చేస్తూ - ముక్తిని డోర్ డెలివరీ చేస్తున్న నేటి కాలంలో కవులు మూలాల రక్షణ ఎరుకతో రాయడం మౌలిక అవసరమన్నారు. పీడితుల దుఃఖాన్ని కళాతత్వంగా చెప్పడం నేటి సాహిత్యంలో కొత్త అభివ్యక్తి అన్నారు. కవులు వస్తువుతో తపస్సు చేస్తే తప్ప కొత్త కవిత్వం రాదన్నారు. మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ, పుస్తకాలు కొనడమంటే కవులు, రచయితలను గౌరవించడమేనన్నారు. ఇంటి నిర్మాణానికి పరిమితులిచ్చే అధికారులు ఆ ఇంట్లో ఒక పుస్తకాల గది వుంచడం తప్పనిసరి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ అధికారి, ప్రముఖ కవి జెల్ది విద్యాధరరావు, పోలీసు అధికారి, కవి లోసారి సుధాకర్, పుస్తక రచయిత బంగార్రాజు కంఠ, సాహితీవేత్తలు ఘంటా విజయ్‌కుమార్, సరికొండ నరసింహారాజు, వరప్రసాద్, శిఖా ఆకాష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్రశేఖర్ పర్యవేక్షించారు.

దశాబ్దాల నాటి సొంతింటి కల..

సాకారం దిశగా!

» ఆశ, నిరాశల నడుమ జర్నలిస్టుల అలుపెరుగని పోరాటం

» ఎమ్మెల్యే యార్లగడ్డ, అధికారుల చొరవతో సొసైటీ స్థలంలో ఆక్రమణల తొలగింపు

» అధికారుల సూచన మేరకు సొసైటీ కార్యాలయం ఏర్పాటు



సొసైటీ కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు

గుణదల, మే 25 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల కోసం నున్న మ్యాంగో మార్కెట్ ఎదురుగా ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 'విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ అండ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ' నేతృత్వంలో తాత్కాలిక కార్యాలయాన్ని ఆదివారం సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిగురుపాటి సతీష్‌బాబు, సొసైటీ సీఈవో ఎస్.వెంకట్రావులు ప్రారంభించారు. కార్యక్రమానికి సొసైటీ సభ్యులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్, వెంకట్రావులు మాట్లాడుతూ, సుమారు పదిహేడేళ్లుగా సొంతింటి కల సాకారానికి జర్నలిస్టులు చేస్తున్న పోరాటంలో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయన్నారు. నాడు ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమణలదారుల నుంచి కాపాడుకునేందుకు నిరంతర పోరాటం చేయాల్సి వచ్చిందని, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారం, అధికారుల చొరవతో ఎట్టకేలకు సొసైటీ స్థలంలోని ఆక్రమణలను తొలగించినట్టు చెప్పారు. ఈ క్రమంలో జర్నలిస్టుల స్థలంలో సొసైటీ తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జర్నలిస్టులు సొసైటీగా ఏర్పడి సొంతింటి కోసం పదిహేడేళ్లకు పైగా పోరాటం చేస్తూనే ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. అటు అధికారులు గానీ, ఇటు పాలకులు గానీ పట్టించుకోక.. ఇంటి కల నెరవేరకుండానే సొసైటీ సభ్యుల్లో కొందరు చనిపోయారని, సొసైటీకి స్థలం మాత్రం సొంతం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి దశాబ్దాల పోరాటానికి ముగింపు పలికేలా సహకారం అందించాలని కోరుతున్నామన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారం మరువలేనిదని, ఆయనకు రుణపడి ఉన్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఈ అంశాన్ని ప్రస్తావించి సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురావటం జరిగిందన్నారు. ఇదే సమయంలో సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి జర్నలిస్టుల పోరాటంపై స్పందించి అవసరమైతే ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చే అంశాన్ని పరిశీలించి సీఎంకు వివరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఆక్రమణల చెరలో ఉన్న స్థలాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి స్థానిక తహసీల్దార్ సుగుణకు విషయం చెప్పి ఆక్రమణలు తొలగించాలని సూచించగా.. రెండు రోజుల్లోనే మొత్తం ఆక్రమణలను తొలగించారన్నారు. దీంతో స్థలం తిరిగి ఆక్రమణలకు గురికాకుండా అధికారుల సూచన మేరకు జర్నలిస్టుల సొసైటీ పేరున బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్థలంలో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు.

జెడ్పీ బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు

(5వ పేజీ తరువాయి)

ఉత్తర్వులు తయారు చేసి, ఈ నిబంధనల ప్రకారం బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు చెప్పారు. జెడ్పీ ఉద్యోగులకు కౌన్సెలింగ్ పద్ధతిలో కాకుండా, బదిలీ కోసం దరఖాస్తు చేసే సమయంలో మూడు ప్రాంతాలను ఆప్షన్‌గా పెట్టుకోవాలని, దీని ప్రకారం కౌన్సెలింగ్ లేకుండా బదిలీలు ఉంటాయనే సంకేతాలు పంపడంతో జెడ్పీ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో, ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఉద్యోగుల వినతి

జెడ్పీ పరిధిలోకి వచ్చే పంచాయతీరాజ్‌లోని వివిధ విభాగాల్లో బదిలీలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో కొన్ని కీలకమైన సూచనలను జెడ్పీ అధికారులు మార్పులు చేసి, తాము అనుకున్న విధంగా జిల్లా పరిషత్ నుంచి ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేశారు. మార్పు చేసిన ఉత్తర్వుల ప్రకారం బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో ఉద్యోగులు ఖంగుతిన్నారు. ఈ పరిణామం అనంతరం జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్‌ను ఉద్యోగులు కలిశారు. ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వ ఉత్తర్వులనే మార్చివేశారని ఆయనకు వివరించారు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను మార్పు చేసిన ఉద్యోగులను పిలిపించి ఆయన ప్రశ్నించారు. ఉద్యోగుల బదిలీల అంశంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవోపైనా ఒత్తిడి రావడంతో ఆయన గత రెండు, మూడు రోజులుగా మిన్నకుండిపోయారని ఉద్యోగులు అంటున్నారు. ఒత్తిడి కారణంగా తాను సెలవు పెట్టి వెళ్లిపోతానని సూచనప్రాయంగా జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో చెబుతున్నారని ఉద్యోగులు చెప్పుకోవడం గమనార్హం. దీంతో జెడ్పీ ఉద్యోగులు ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మను ఇటీవల కలసి విషయం తెలియజేశారు. కలెక్టర్ వచ్చిన తర్వాత ఈ అంశాన్ని పరిశీలిస్తారని ఆమె చెప్పారు. దీంతో కొందరు ఉద్యోగులు ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి మరీ కలసి, ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా బదిలీలు చేయాలని కోరారు. బదిలీలు జరుగుతాయని, కానీ కొద్దిపాటి మార్పులతో జరుగుతాయని ఆమె చెప్పారని జెడ్పీ ఉద్యోగులు అంటున్నారు. జెడ్పీలో ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారు 40 మంది, రెండేళ్లు అంతకు మించి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారు 300 మంది వరకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. వీరిని ఎక్కడెక్కడకు బదిలీ చేస్తారనే అంశంపై జెడ్పీ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. వైసీపీ పాలనలో జెడ్పీ ఉద్యోగులపై ఒత్తిడి కత్తి పెట్టడంతోపాటు తమకు అనుకూలంగా లేరనే కారణం చూపి వివిధ విభాగాల్లో అత్యంత కీలక విధులను నిర్వహించేవారిని గతంలో దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. మరి కొందరు ఉద్యోగులు వేధింపులు తాళలేక బదిలీ చేయించుకుని ప్రాధాన్యతలేని పోస్టుల్లోకి వెళ్లారు. దీంతో జెడ్పీలో కీలక విభాగాల్లో పనులను చక్కబెట్టేవారు లేకుండా పోయారని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం జరిగే బదిలీల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయనే భయం ఉద్యోగులను వెంటాడుతోంది.

సెలవులో జెడ్పీ సీఈవో!

జెడ్పీ సీఈవో కన్నమనాయుడు కొన్నిరోజులుగా సెలవులో ఉన్నారు. వ్యక్తిగత కారణాలతో ఆయన సెలవు పెట్టారని పైకి చెబుతున్నా, తెరవెనుక అనేక అంశాలు ముడిపడి ఉన్నాయని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనాన్ని జెడ్పీ జనరల్ ఫండ్స్ నుంచి విడుదల చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు జెడ్పీటీసీ సభ్యులు ఇటీవల పట్టుబట్టారు. జెడ్పీ జనరల్ ఫండ్స్ నుంచి జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేయడం నిబంధనలకు విరుద్ధమని, ఆడిట్ అభ్యంతరాలు వస్తాయని సీఈవో ఆ ఫైల్‌ను పక్కన పెట్టేశారు. దీంతో సీఈవోపై జెడ్పీ పాలకవర్గ సభ్యులు గుర్రుగా ఉన్నారు. ఈ కారణం చూపి ఇటీవల జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. ఈ నెల 26వ తేదీతో జెడ్పీ సీఈవో సెలవు ముగుస్తుంది. జెడ్పీ ఉద్యోగుల బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో జూన్ 1, 2 తేదీల్లో జరపాల్సి ఉంది. సీఈవో కన్నమనాయుడు వస్తే ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఉద్యోగుల బదిలీలను చేస్తారని, అయితే ఆయనపై ఒత్తిడి తెచ్చి సెలవు పొడిగించేలా తెరవెనుక వ్యవహారం నడుస్తోందని జెడ్పీ ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. రానున్న రోజుల్లో జెడ్పీ విభాగంలో ఉద్యోగుల బదిలీల అంశం ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచిచూడాలి.

పోలవరం గట్టు గుట్టు.. గప్‌చుప్!

(5వ పేజీ తరువాయి)

కరిగించేశారు. ఈ సబ్‌డివిజన్ పరిధిలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఇచ్చిన సమాధానం మేరకు చూస్తే.. 2015 నుంచి 2019 వరకు పోలవరం కాల్వ తవ్వకాలకు సంబంధించి మొత్తంగా 58,45,266 క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. ఈ మట్టిని కాల్వకు రెండు వైపులా గుట్టలుగా పోశారు. ఇందులో 3,33,999 క్యూబిక్ మీటర్ల మేర ప్రభుత్వ శాఖల అవసరాల కోసం కేటాయించారు. దీని ప్రకారం చూస్తే మరో 55 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి ఉండాలి. ఎంత మట్టి ఉందో తెలియదని సమాధానం ఇచ్చారు. మిగిలిన మట్టికి సంబంధించి లెక్కలు ఎందుకు చెప్పలేకపోతున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. గన్నవరంలో కొద్దిచోట్ల తప్ప దాదాపు పోలవరం మట్టి తరలింపునకు గురైంది. ఎంత మట్టి ఉందో కనీసం ఇప్పటికీ ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి లెక్కలు తీయకపోవటం గమనార్హం.

జక్కంపూడి కొండ గ్రావెల్, మట్టి ఏమైందో తెలియదు

పోలవరం కుడి కాల్వ నిర్మాణం కోసం జక్కంపూడి దగ్గర కొండను తవ్వాల్సి వచ్చింది. 2015 - 2019 వరకు రికార్డుల్లో ఉన్న సమాచారం మేరకు 28,73,922 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఇందులో 5,46,860 క్యూబిక్ మీటర్ల మేర ప్రభుత్వ అవసరాలకోసం కేటాయించారు. పోనీ అధికారుల లెక్కనేచూస్తే మరో23లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఏమైందో తెలియదు? క్షేత్రస్థాయిలో తట్టెడు గ్రావెల్ కూడా లేదు. ఎంత గ్రావెల్ ఉందో కూడా అధికారులు చెప్పట్లేదు.

మిగిలింది ఎంత?

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పరిధిలో పోలవరం కుడికాల్వకు సంబంధించి 2005-15, 2015-19 వరకు కాల్వ నిర్మాణ పనులు జరిగాయి. గన్నవరం సబ్ డివిజన్ పరిధిలో 2005 నుంచి 2014 వరకు ఎలాంటి కాల్వ తవ్వకాలు జరగలేదు. 2015 నుంచి 2019 వరకు 58,45,266 క్యూబిక్ మీటర్లు తవ్వి కాలువ ఒడ్డున నిల్వ చేశారు. ప్రభుత్వ అవసరాల కోసం 3,33,299 క్యూబిక్ మీటర్ల మట్టిని కేటాయించారు. ఇంకా 55,11,967 క్యూబిక్ మీటర్ల మేర మట్టి ఉండాలి? ఎంత ఉందో లెక్క తెలియదట.

● నున్న సబ్ డివిజన్ పరిధిలో 2014 వరకు 53,67,162 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి నిల్వ చేశారు. ఇందులో 12,71,685 క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వ శాఖలకు కేటాయించారు. పోగా 40,95,477 క్యూబిక్ మీటర్ల మట్టి ఏమైందో తెలియదట.

● విజయవాడ సబ్ డివిజన్ పరిధిలో 2014 వరకు 36,04,508 క్యూబిక్ మీటర్లు, 2019 నాటికి మరో 28,73,922 క్యూబిక్ మీటర్లు తవ్వి నిల్వ చేశారు. మొత్తంగా 64,78,430 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వగా, 10,58,114 క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వ శాఖలకు కేటాయించారు. పోగా 54,20,316 క్యూబిక్ మీటర్లకు లెక్క లేదు.

● వెలగలేరు సబ్‌డివిజన్ పరిధిలోని ఏఈ సెక్షన్ 1,2,3 పరిధిలో 25,84,821 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి నిల్వచేయగా, అందులో 2,25,197 క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వ అవసరాలకు కేటాయించారు. మిగిలిన 23,59,624 క్యూబిక్ మీటర్ల మట్టికి లెక్కలేదు.

క్షీర విప్లవ పితామహుడి సతీమణి అస్తమయం



స్వర్ణకుమారి

రామలింగేశ్వరనగర్ : క్షీర విప్లవ పితామహుడు, విజయా డెయిరీ వ్యవస్థాపకుడు, ఆంధ్రా కురియన్‌గా పేరొందిన వి.జస్వంతరావుకు సతీవియోగం కలిగింది. జస్వంతరావు సతీమణి స్వర్ణకుమారి (85) శనివారం సికింద్రాబాద్‌లోని మౌలాలిలో ఉన్న స్వగృహంలో కన్నుమూశారు. జస్వంతరావు, స్వర్ణకుమారి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. స్వర్ణకుమారి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజజీయర్ స్వామి శిష్యురాలిగా ఉన్నారు. ఆధ్యాత్మిక తేజోమణిగా పేరొందారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, వెంకటేశ్వరరావు (ఫైల్)

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

» ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

నందిగామ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని అనాసాగరం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఐదుగురికి గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు.. కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలం వెంట్రప్రగడకు చెందిన చింటూరి వెంకటేశ్వరరావు (66) భార్య నాగమణి, కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి తెలంగాణలోని సరస్వతీ నది పుష్కరాలకు కాళేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా అనాసాగరం వద్ద ఫ్లైఓవర్‌పై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన వెంకటేశ్వరరావు, నాగమణి, పెద్ద కుమార్తె శ్యామల, బంధువులు రవి, భార్య లక్ష్మీలతో పాటు విజయవాడకు చెందిన కారు డ్రైవర్ కొమరంపల్లి కార్తిక్‌లను హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో వెంకటేశ్వరరావు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాయుడు తెలిపారు.

వెంట్రప్రగడలో విషాదఛాయలు

పెదపారుపూడి : రోడ్డు ప్రమాదంలో చిట్టూరి వెంకటేశ్వరరావు మృతి చెందడంతో వెంట్రప్రగడ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వెంకటేశ్వరరావుకు భార్య చిట్టూరి నాగమణి, కుమార్తెలు ముగ్గురు, కుమారుడు ఉన్నారు. క్యాటరింగ్ పనులు చేస్తు జీవనం సాగిస్తూ అందరికి సుపరిచితుడైన వెంకటేశ్వరరావు మృతి పట్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంట్రప్రగడ రవిచంద్రశేఖర్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చికిత్స పొందుతూ నేవీ ఉద్యోగి మృతి

పెనమలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మర్చంట్ నేవీ ఉద్యోగి మోటారుసైకిల్‌పై అత్తగారింటికి వెళుతూ రోడ్డుపై జారిపడిన ఘటనలో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన తాతినేని కాత్యారావు(33) మర్చంట్ నేవీలో పనిచేస్తున్నాడు. సెలవుపై ఇంటికి వచ్చాడు. ఈనెల 21న ఉదయం ఎనికేపాడులోని అత్తగారింటికి వెళుతుండగా కానూరు ఆర్సీఎం చర్చి వద్ద రహదారిపై అదుపుతప్పి పడిపోయాడు. తలకు బలమైన దెబ్బతగలడంతో చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

వారు రోహింగ్యాలే..

బైండోవర్, హైదరాబాద్ తరలింపు

పెనమలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం తాడిగడపలో గురువారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్న యువకులను రోహింగ్యాలుగా గుర్తించారు. ఈ సందర్భంగా వారి వివరాలను పోలీసులు ఆదివారం తెలిపారు. వారు హైదరాబాద్ శరణార్థి శిబిరం నుంచి తప్పించుకుని వచ్చి వివిధ ప్రాంతాల్లో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. పలు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 15 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామని, వీరిలో ముగ్గురు హైదరాబాద్‌కు శరణార్థి శిబిరానికి చెందినవారు కాగా, మిగిలిన 12 మంది మయన్మార్ నుంచి అక్రమంగా మనదేశంలోకి ప్రవేశించిన వారుగా గుర్తించామన్నారు. రోహింగ్యాలు హైదరాబాద్ బాలానగర్‌లోని శరణార్థి శిబిరం నుంచి తప్పించుకుని వచ్చి తాడిగడప, వందడుగుల రోడ్డు, గంగూరు ప్రాంతాల్లో భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నట్లు గుర్తించామని, వీరి నుంచి తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఒక కారు, 16 సెల్‌ఫోన్లు, బంగారం, కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వారిని పెనమలూరు తహసీల్దార్ గోపాలకృష్ణ బైండోవర్ చేసి హైదరాబాద్‌లోని శరణార్థి శిబిరానికి తరలించామన్నారు.

ఈ ఏడాది రోహిణి లేనట్టే..!

(5వ పేజీ తరువాయి)

కొనసాగుతుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

చాన్నాళ్ల తర్వాత

వేసవి కాలంలో ప్రతి ఏడాది మే నెలలో రోహిణి కార్తె ప్రారంభమవుతుంది. ఇది 15 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ 15 రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాల్పులు విపరీతంగా వీస్తాయి. రాత్రి ఏడెనిమిది గంటల వరకు వేడి గాలులు వీస్తాయి. ఈ రోహిణి కార్తె ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఇది జూన్ ఎనిమిదో తేదీ వరకు ఉంటుంది. రోహిణి రోజుల్లో జిల్లా మొత్తం నిప్పుల కొలిమిలా మారుతుంది. ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత కనిపించింది. ఈ పరిస్థితి మధ్యాహ్నం రెండు, మూడు గంటల వరకు మాత్రమే ఉంది. ఆ తర్వాత నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఆకాశం మేఘావృతమై చల్లనిగాలులు వీచాయి. ఒక్కసారిగా వర్షం కురవడం మొదలైంది. సాధారణంగా ప్రతి ఏడాది రోహిణి కార్తె ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు 42 నుంచి 46 డిగ్రీల వరకు నమోదవుతాయి. వాతావరణ శాఖ రికార్డులు ఇదే విషయాన్ని తెలియజేస్తున్నాయి. ఈ ఏడాది మాత్రం రోహిణి ప్రభావం ఉమ్మడి కృష్ణా జిల్లాపై పడలేదు. రోహిణి అడుగుపెట్టిన తర్వాత వరుణుడు ఆ వేడిని చల్లార్చడంతో ప్రజలకు ఒక్కసారిగా ఉపశమనం లభించినట్టయింది. ఇలాంటి పరిస్థితి ఇంతకుముందు చాన్నాళ్ల క్రితం చూశామని ప్రజలు చెబుతున్నారు. బంగాళాఖాతం, అరేబియన్ సముద్ర గర్భంలో అల్పపీడనం ఏర్పడడంతో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ వర్షాలు నెలాఖరు వరకు నిరంతరం కురుస్తాయని అంచనా వేశారు. దీనితోడు మరో మూడు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రంలోకి అడుగుపెట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, రుతుపవనాల రాకతో ఉమ్మడి కృష్ణా జిల్లాకు రోహిణి సెగ తప్పినట్టవుతుంది.

టీడీపీ పండుగకు వేళాయె!

(5వ పేజీ తరువాయి)

ఆశలు, ప్రతిపాదనలు, సమస్యల అజెండాలతో జిల్లా నాయకత్వాలు మహానాడుకు బయలుదేరుతున్నాయి.

మహానాడు దృష్టికి పలు తీర్మానాలు

నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించిన మినీ మహానాడుల్లో అనేక తీర్మానాలు చేశారు. జిల్లాల స్థాయిలో నిర్వహించిన మినీ మహానాడుల్లో సైతం పలు తీర్మానాలు చేయటం జరిగింది. మచిలీపట్నం పోర్టు ఏర్పాటు నేపథ్యంలో పోర్టు ఆధారిత ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని, అసైన్డ్ భూముల సమస్యకు పరిష్కారం చూపాలని, మచిలీపట్నం - రేపల్లె రైల్వేలైన్ చేపట్టాలని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, గోల్డ్ కవరింగ్, కలంకారీకి ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని, ఆక్వా రైతుల అందరికీ యూనిట్ కరెంట్ రూ.1.50కే అందించాలని, మచిలీపట్నం - విజయవాడ ఆరు వరసల రోడ్డును అనుసంధానం చేయాలని, ఎన్‌హెచ్ - 216 ను 4, 6 లైన్లుగా విస్తరించాలని, మల్లవల్లి పారిశ్రామిక కారిడార్‌కు ఎక్కువ పరిశ్రమలు వచ్చేలా చూడాలని, పోలవరం కుడి కాలువ 137 కిలోమీటర్ దగ్గర బండారుగూడెం నుంచి ఏలూరు కాలువ 36 కిలోమీటర్ వరకు గోదావరి జలాలను తీసుకు వచ్చే లింకు చానల్‌కు సవరించిన అంచనాల ప్రకారం రూ. 32 కోట్లు మంజూరు చేయాలని, గన్నవరం నియోజకవర్గంలో 15 వేల మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, గుడివాడలో తాగునీరు, వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేయాలని, పామర్రులో యువత, విద్యార్థి, ఉద్యోగ ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలని, విదేశీ విద్య, విద్యా దీవెన అమలు చేయాలన్న తదితర ప్రతిపాదనలతో మహానాడుకు బయలుదేరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

టీడీపీ కంకిపాడు అధ్యక్షుడి ఎంపికకు నిరసనగా పలువురి రాజీనామా

కంకిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కంకిపాడు మండల అధ్యక్షుడిగా జగన్నాధపురం ప్రాంతానికి చెందిన సుదిమళ్ల రవీంద్రను నియమించటాన్ని నిరశిస్తూ ఆ పార్టీ నాయకులు పలువురు రాజీనామాలు చేశారు. పార్టీ కంకిపాడు యూనిట్ ఇన్‌చార్జి పులి శ్రీనివాసరావు, కంకిపాడు గ్రామప్రధాన కార్యదర్శి కొండ నాగేశ్వరరావు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు పంపారు. తమకు పదవులు అవసరం లేదని తాము పార్టీకి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు సేవ చేస్తామని వీరంతా ప్రకటించారు. రాజీనామా చేసిన నాయకులను బుజ్జగించేందుకు పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బాధ్యతలు అప్పగించారు. ఆయన రెండు రోజుల్లో రాజీనామా చేసిన నాయకులతో సంప్రదింపులు జరపనున్నారు.

ప్రయాణం.. ప్రమాదం!

● శిథిలావస్థకు చేరిన వన్నేరువాగుపై ముక్కపాడు వంతెన

(ఉంగుటూరు / ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

మండలంలోని ముక్కపాడు ఊరి మధ్య గుండా వెళ్లే వన్నేరు వాగుపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నెలవుగా మారింది. వంతెన దిగువన పిల్లర్ల గోడలకు బీటలు ఏర్పడి, అడుగున శ్లాబ్ మొత్తం పగుళ్లిచ్చింది. పలుచోట్ల పెచ్చులు ఊడి ఇనుపచువ్వలు బయటపడి బలహీనంగా మారింది. నిత్యం ఈ వంతెన పైనుంచి పలు వాహనాలపై వివిధ వర్గాల ప్రజలు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, మండలకేంద్రమైన ఉంగుటూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈక్రమంలో సుమారు 70ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు వినతిపత్రాలు అందజేసినా, ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు స్పందించి నూతన వంతెన నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రమాదకరంగా ముర్కోడుపై వంతెన

ఉంగుటూరు నుంచి ఆత్కూరు వెళ్లే కొత్త రోడ్డులో మురుక్కోడుపై ఎన్నో ఏళ్లక్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా రక్షణగోడలు లేకపోవడం, వంతెన దిగువన గోడలు నెర్రలివ్వటం, అప్రోచ్‌రోడ్డు కోతకు గురై వంతెన అంచున గొయ్యి ఏర్పడటం, వంతెన వద్ద రోడ్డు ప్రమాదకర మలుపు తిరిగివుండటంతో రాత్రివేళల్లో ప్రయాణాలు సాగించే వాహనచోదకులు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి కాలువలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు, కూటమి నాయకులు స్పందించి పాతవంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



రక్షణ గోడలు లేక, నెర్రలిచ్చిన శ్లాబుతో ప్రమాదకరంగా ముక్కపాడు వంతెన





మురుక్కోడు వంతెన అంచున ఏర్పడ్డ గొయ్యి.. అప్రోచ్ రోడ్డు కోతకు గురైన పెద ఓగిరాల వంతెన

అప్రోచ్ రోడ్డు కోతకు గురైన పెదఓగిరాల వంతెన

పెదఓగిరాల వద్ద పుల్లేరు కాల్వపై వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురై ప్రమాదాలు జరుగుతున్నాయి. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి గ్రామానికి రాక పోకలు ఈ వంతెనపై నుంచి సాగిస్తుం టారు. బ్రిటీష్ వారి హయంలో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. అప్రోచ్ రోడ్డుకు ఇరువైపుల రోడ్డు కోసుకుపోయి ప్రమాదకరంగా మారింది. రాత్రివేళ చీకటిలో ద్విచక్ర వాహనాలు, ఆటోలపై వచ్చేవారు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన అప్రోచ్ రోడ్డుకు సైడ్‌వాల్ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదల కోసమే పార్టీని ప్రారంభించిన ఎన్టీఆర్

● రూ.2కే కిలో బియ్యం ఇచ్చిన ఘనత ఆయనదే..ఆ పథకాన్ని ఇప్పటికీ తీయడానికి ఎవరూ సాహసించరు

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విజయవాడ, మే 25 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం 43 ఏళ్ల కిందట కిందట ఎన్టీ రామారావు పార్టీ పెట్టారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, పేదలకు తినడానికి తిండి లేక ఇబ్బంది పడుతున్న సమయంలో పార్టీ పెట్టి కిలో రెండు రూపాయలకే బియ్యం అందించిన ఘనత ఎన్టీ రామారావుదేనని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పథకాన్ని తీసే ధైర్యం ఎవరూ చేయలేదన్నారు. తరువాత కాలంలో చంద్రబాబు నాయుడు సీఎం అయిన సమయంలో రాష్ట్ర బడ్జెట్ రూ.3 వేల కోట్లు దానిని రూ.30 వేల కోట్లకు పెంచడంతో పాటు ఇంజినీరింగ్ కాలేజీలను పెంచి ఐటీ ఉద్యోగాలు కల్పించడంలో రాష్ట్రాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. రాష్ట్ర బడ్జెట్ రూ.30 వేల కోట్లు ఉన్నప్పుడే 15వేల ఎకరాల్లో ఫైనాన్సియల్ డిస్ట్రిక్ నిర్మించి, హైటెక్ సిటీగా తీర్చిదిద్దడం ఆయనకే సాధ్యమన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ చెప్పినట్లు 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ముందుకెళ్తున్నారని, ప్రతి ఏటా ఎన్టీఆర్ పుట్టిన రోజును మహానాడుగా జరుపుకోవడం జరుగుతుందని, కర్నూల్‌లో జరిగే మహానాడులో నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్ని జయప్రదం చేయాలని యార్లగడ్డ కోరారు.



ఉయ్యూరు డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ఉయ్యూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం జనరల్ సెక్రటరీ జీటీవీ రమణ, జిల్లా సంఘం కోశాధికారి ఏఎస్ఆర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం గుడివాడలో జరిగిన డివిజన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఓగిరాల తిరుమల వెంకటరత్నం, ఉపాధ్యక్షులుగా ఎం. పద్మశ్రీవేణి, కేబీవీఎన్‌ఎం స్వామి, ప్రధాన కార్యదర్శిగా డి.మునిరాజు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా పీవీ సుబ్బారావు, బి.వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ లక్ష్మణబాబు, జె. దేవచంద్రరావు, జి.శ్రీనివాస్, ఎం.కృష్ణమోహన్, వి. శ్రీరామ్ ఎన్నికయ్యారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఉంగుటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఓంద్రంపాడు దాసాంజనేయస్వామి దేవస్థానంలో పదహారు రోజుల పండుగను ఆదివారం దాసాంజనేయస్వామి గ్రామ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఆలయ ప్రాంగణంలో వైభవంగా జరిపిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, స్వామివారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని, 16రోజుల వేడుకను గ్రామస్థులంతా కలిసి సంప్రదాయబద్ధంగా జరిపారు.ఆలయ ప్రధాన అర్చకులు చదలవాడ కుమారస్వామి, శివ నాగేశ్వరరావు నేతృత్వంలో ఆలయ కమిటీ పెద్దలు చింతా నాగార్జునరావు, కృష్ణకుమారి దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ అభ్యుదయ సేవాసంఘం ప్రతినిధులు వీరాంజనేయులు, చెన్నా ఈశ్వర కృష్ణప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ముగిసిన వజ్రోత్సవ వేడుకలు

హనుమాన్‌జంక్షన్ : స్థానిక నూజివీడు రోడ్డులోని సీతారామ దాసాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 21నుంచి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలోని దాసాంజనేయస్వామికి, ప్రాంగణంలోని 45అడుగుల భారీ హనుమాన్ విగ్రహానికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి స్థానిక అభయాంజనేయస్వామి కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చౌడే వెంకయ్య కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

మరకత లింగానికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపులపాడు మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం మాసశివరాత్రి త్రయోదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు, అర్చనలు జరిపారు. తొలుత గణపతిపూజ, అనంతరం బ్రహ్మసూత్ర మరకత లింగానికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, విశేషద్రవ్యాలతో అభిషేకాలు వైభవోపేతంగా నిర్వహించారు. భ్రమరాంబిక అమ్మకు శ్రీసూక్తం విధానంలో పూజలు, కుంకుమార్చనలతో పాటు, నందీశ్వరస్వామికి ఏకవార రుద్ర హోమం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, సభ్యులు తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, వీరమాచినేని నాగయ్య తదితరులు పర్యవేక్షించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో..

గుడ్లవల్లేరు : పెసరమిల్లిలో వేంచేసి యున్న అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మండల పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ నిర్వహించిన 41 రోజులకు ఈ మండల పూజాకార్యక్రమాలను నిర్వాహకులచే నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయం వద్ద హోమం, పూర్ణాహుతి, హారతి కార్యక్రమాలు నిర్వహించి అన్నసమారాధన చేశారు. కార్యక్రమానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జగన్మోహనరావు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా టీడీపీ

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసే కార్యకర్తలు అకాల మరణం చెందితే వారి కుటుంబాలకు పార్టీ కొండంత అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం కానూరులో ఇటీవల అకాల మరణం చెందిన పార్టీ క్రియాశీలక సభ్యుడు ఎర్నేని లక్ష్మీకాంత్ కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు. పార్టీ ప్రధాన కార్యాలయం కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి వచ్చిన ఐదు లక్షల చెక్కును లక్ష్మీకాంత్ భార్య, పిల్లలకు అందజేశారు. భవిష్యత్తులో ఎటువంటి అవసరం వచ్చినా పార్టీ ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవికిరణ్ తదితరులు ఉన్నారు. పోరంకి చేపల కుండీలు తారకరామనగర్ వద్ద ఉన్న 26 పేద కుటుంబాలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం పొజిషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, అన్నే ధనయ్య, వడ్లమూడి శుభశేఖర్, బొప్పన లావణ్య, కొణతం సుబ్రహ్మణ్యం, జంపన గుర్నాధం, సంగెపు రంగారావు, సూదిమళ్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

వైద్యశిబిరానికి విశేష స్పందన

తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జైరా హెల్త్ కేర్ క్లినిక్, మస్జిద్ ఏ మహమ్మదీయ వారి సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. షుమారు రెండు వందల మందికిపైగా స్థానికులు షుగర్, బీపీ లాంటి పరీక్షలను చేయించుకొన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, సాగి కృష్ణంరాజు, తుమ్మల రాంకుమార్, మన్నే రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన వైసీపీ నాయకులు

మునిగిపోయిన నావ వైసీపీ

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ

కంకిపాడు/ భారతీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : మునిగిపోయిన నావ వైసీపీ అని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అన్నారు. జనసేన పార్టీ జిల్లా కో- ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు ఆధ్వర్యంలో కంకిపాడుకు చెందిన వైసీపీ నాయకులు చింతకింద సాయి సునీల్, కోటేలు వెంకటేశ్వరరావు, తంబాబత్తుల చినకనకయ్య, గుడివాడ హరికృష్ణ ఫ్రెండ్స్, అంబుల రాంబాబు ఫ్రెండ్స్ కూనపరెడ్డి రామకృష్ణ ఫ్రెండ్స్ కంకిపాడు ఆటో యూనియన్ అధ్యక్షులు కోలా గోపి, పలువురు ఆటో యూనియన్ నాయకులు ఆదివారం విజయవాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండ్రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఆ పార్టీలో ఉండాలో లేదో ఆలోచించుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఉంగుటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. వీధుల్లో నీరంతా రోడ్లపైకి చేరి కాలువలను తలపించాయి. ముఖ్యంగా పెదఅవుటపల్లి, తేలప్రోలు, మానికొండ, ఇందుపల్లి, లంకపల్లి, తదితర గ్రామాల్లో అస్తవ్యస్తమైన డ్రెయినేజీ వ్యవస్థతో ప్రజలు అవస్థలు పడ్డారు. పొంగిన డ్రెయిన్లలో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కాగా తేలప్రోలు పాత ఎస్సీకాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ స్తంభించి మురుగునీరు సమీపంలోని ఆర్సీఎం చర్చి ప్రాంగణంలోకి చేరడంతో ఆదివారం దైవప్రార్థనలు చేసుకునేందుకు వచ్చిన క్రైస్తవ సంఘస్థులు, విశ్వాసులు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని సంఘపెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళనకు పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తేలప్రోలులో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఉంగుటూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేసే సిబ్బంది సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని ఉంగుటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ అనగాని నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సెక్షన్ పరిధిలో పనిచేసే సిబ్బంది వివరాలను ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. మానికొండ ఎల్ఐ జగన్నాథం వెంకటేశ్వర్లు (6281709031), ఉంగుటూరు, పొణుకుమాడు, ఎలుకపాడు లైన్‌మెన్ గాదెళ్ల ఛార్లెస్(9581205210), ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, గారపాడు అసిస్టెంట్ లైన్‌మెన్ ధారావతు మోహనరావు (6281 709093), లంకపల్లి, ఓంద్రంపాడు ఏఎల్ఎం గుండే ప్రసాద్ (9347 367728), చింతగుంట రవిబాబు(6281 70 9073) ఆయా గ్రామాలకు బాధ్యత వహిస్తున్నారన్నారు. వెల్దిపాడు, నాగవరప్పాడు, తుట్టగుంట, వెన్నూతల లైన్‌మెన్ ఇందుపల్లి ధర్మారావు (9581205195), తరిగొప్పల, వేంపాడు లైన్‌మెన్ నాగనబోయిన ఫణికుమార్ (9581205214) పనిచేస్తుండగా ఆయా గ్రామాలకు గ్రేడ్-2 జెఎల్ ఎంగా ధారావతు రమేష్ (6281709076)బాధ్యులుగా ఉన్నారన్నారు. మానికొండ లైన్‌మెన్ కోడే రాజ్‌కుమార్ (9581205194), నందమూరు, మధిరపాడు ఏఎల్‌ఎంగా బొలిగర్ల వరప్రసాద్ (6281709112), చికినాల, బొకినాల ఏఎల్‌ఎంగా తులిమెల్లి రాంప్రసాద్ (6281709104)తోపాటు గ్రేడ్-2 జెఎల్ ఎంగా ఆత్మకూరి నరసింహారావు (6281709089)వ్యవహరిస్తున్నారన్నారు. ఇందుపల్లి లైన్‌మెన్‌గా హనుమంతు వెంకట సత్యనారాయణ (6281709086), ముక్కపాడు, వేమండకు లైన్‌మెన్‌గా అరతోటి శ్రీకాంత్(9581205210)తోపాటు గ్రేడ్-2 జెఎల్‌ఎంగా సత్యనారాయణ బాధ్యు లుగా వున్నారన్నారు. సిబ్బంది మొత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో వుంటూ, కరెంట్ సరఫరాలో కలిగే ఆటంకాల నివారణకు కృషిచేస్తారని ఏఈ పేర్కొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ 9న

హాజరుకానున్న మంద కృష్ణమాదిగ

గన్నవరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు కోట దానియేలు మాదిగ అన్నారు. స్థానిక అంబేడ్కర్ పార్క్‌లో ఆదివారం కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కోట కృష్ణమోహన్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పద్మశ్రీ అవార్డు అందుకున్న మంద కృష్ణమాదిగ మొదటిసారిగా నియోజకవర్గంలోని చింతకుంటలో జూన్ 9న జరిగే విగ్రహావిష్కరణకు వస్తున్న నేపథ్యంలో ఆయన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మంద వేణు, దేవరపల్లి విక్టర్‌బాబు, ఏసుబాబు, పులపాక పాస్కల్, కొప్పుల కామేశ్వరరావు, పి. కృష్ణ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ నాయకుడు తొమ్మండ్రు రుద్రయ్య మాదిగ, లామ్ రమేష్, వడ్లమూడి రమేష్, డోలా రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

తాగునీరు అందించాలని ధర్నా

గుడివాడ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మల్లాయిపాలెంలోని కాళహస్తీ కాలనీ వాసులకు తాగునీటిని అందించాలని సీఐటీయూ నాయకులు ఆర్‌సీపీ.రెడ్డి డిమాండ్ చేశారు. తాగునీరు అందించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం కాళహస్తీ కాలనీ మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం ధర్నా నిర్వహించగా, ఎమ్మెల్యే రాము పైపులైన్లు వేసి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారని, నేటి వరకు హామీ నెరవేరలేదని తెలిపారు. డి.వి.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి కాలనీలో ధర్నా చేస్తున్న మహిళలు

తాగునీరు వృథా

కూచిపూడి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఐలూరు నుంచి మొవ్వ మండలంలోని పలు గ్రామాలకు పైపులైన్ ద్వారా వచ్చే కృష్ణా తాగునీరు పలు చోట్ల పైపులు లీకేజీ కారణంగా వృథాగా నీరు పోతున్నా అధికారులు ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. ప్రతిరోజూ రావాల్సిన కృష్ణా వాటర్ వారంలో మూడు నుంచి నాలుగు రోజులే అందిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. అన్ని గ్రామాలకు కృష్ణా వాటర్ అందించటంతోపాటు లీకేజీలని సరి చేసి ప్రతీ రోజు తాగునీరు సక్రమంగా వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. చినముత్తేవి, ఆవిరిపూడి, నిడుమోలు లాకుల వద్ద పైపులైన్ లీకేజీల కారణంగా పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు.

మేజర్ దంపతులకు సత్కారం

పెదపారుపూడి, మే 25 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి రక్షణ సైన్యం దేవాలయంలో గుడివాడ డివిజనల్ కమాండర్‌గా నూతనంగా మేజర్ జల్లి మోషే, మేజర్ జల్లి మేరీ కుమారిని పూలమాలతో శాలువాలతో స్వాగతం పలికారు. అనంతరం మోషే మాట్లాడుతూ రక్షణ సైన్యం 150 దేశాల్లో పని చేస్తుందని, సాంఘిక, సామూహిక, సువార్త, సేవలు అందిస్తుందని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి మేజర్ విజయ్ కుమార్, మేజర్ రూతు కుమారి, సంఘ పెద్దలు దగాని జోసఫ్, నత్తా భూషణ్ కుమార్, గూడపాటి భాస్కరరావు, గృహ సమితి సభ్యులు దగాని గ్రేస్, పీక పద్మ, సండే స్కూల్ టీచర్ ఖమ్మం జీవన ప్రియ, నత్తా సోనియా, పాల్గొన్నారు.

ఘనంగా సంగీతనాద ధ్యానం

గుడివాడ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : లింగవరంలోని కొల్లారెడ్డి సుశీలమ్మ కల్యాణ మండపంలో ఆదివారం గాదిరెడ్డి చిరంజీవిరెడ్డి ఆధ్వర్యంలో సంగీత నాధ ధ్యాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భీమవరానికి చెందిన పిప్పళ్ల ప్రసాద్ బృందం అద్భుతమైన సంగీతనాదంతో ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో 300మంది కళాకారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్‌ట్యాంక్

● ఎప్పుడు కూలుతుందోనని భయాందోళనలో ప్రజలు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ రూరల్): బొమ్ములూరులోని రక్షిత తాగునీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాటర్ ట్యాంక్ పెచ్చులూడి సిమెంట్, ఇనుపచువ్వలు బయటపడ్డాయి. ఇనుప చువ్వలు తుప్పు పట్టి ఉండటంతో ఏ క్షణంలో కూలుతుందోనని పంచాయతీ సిబ్బంది, అధికారులు, నాయకులు భయాందోళనలకు గురవుతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి వాటర్ ట్యాంక్‌కు చెమ్మ వచ్చి వాటర్ చిమ్ముతుంది. ఈ వాటర్ ట్యాంక్ కూలితే బొమ్ములూరు గ్రామస్థులకు తాగునీటి అవసరాలు తీర్చటానికి చాలా ఇబ్బంది ఎదుర్కొవలసి వస్తుంది. అధికారులు స్పందించి వెంటనే బొమ్ములూరు రక్షిత తాగునీటి పథకానికి నిధులు మంజూరు చేసి, ఈ పాత ట్యాంక్ కూల్చివేయాలని కోరుతున్నారు. బుధవారం ఉదయం ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శి రామ్మోహనరావు తదితరులు వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. వాటర్ ట్యాంక్ కూలటానికి సిద్ధంగా ఉందన్నారు. నూతన ట్యాంక్ నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు.



బొమ్ములూరులో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్



ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్



పరుగుపందేల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

క్రీడలపై ఆసక్తి తప్పనిసరి

పామర్రు, మే 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందించే క్రీడల పట్ల చిన్ననాటి నుంచే మక్కువ చూపాలని గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో చిన్నారులకు ఆదివారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా చిన్నారులకు వివిధ క్రీడల పట్ల అవగాహన కల్పించారు. ఆటల వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఇదే విధంగా మండల జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు వివిధ అంశాల్లో గ్రామ మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవిలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్, చిన్నారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తోట్లవల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో 1996-97లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంతో పులకించారు. 28 సంవత్సరాల క్రితం పదో తరగతి చదివి ఆ తరువాత ఎవరికి వారు విడిపోయారు. వివిధ రంగాల్లో స్థిరపడి మళ్లీ అందరూ ఒకే వేదికపై కలుసుకుని తన్మయం చెందారు. వేదికపై ఒకరికొకరు పరిచయం చేసుకుని ఏ రంగంలో స్థిరపడ్డామో తెలియజేసి కుటుంబ వివరాలను పంచుకున్నారు. నాడు హైస్కూల్లో చదువుకున్న తీరు, చేసిన అల్లరిని, చదువు చెప్పిన గురువులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. నాటి సహచరులు సుమారు 90మంది, వారి కుటుంబసభ్యులు పండుగ వాతావరణంలో ఆత్మీయ విందు చేసుకుని సాయంత్రం వరకు హైస్కూల్ ఆవరణలో గడిపారు. పదో తరగతిలో చదువు చెప్పిన గురువులు ఈడ్పుగంటి సామ్యేలు, బి. శ్రీనివాసరావు, నరేంద్రప్రసాద్ సురేష్ సంధ్యారాణి, బీవీ సుబ్బారావులను వేదికపై సన్మానించారు.



తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో ఆత్మీయ కలయికలో 1996-97 టెన్త్ బ్యాచ్

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

గుడివాడ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): గుడివాడ డివిజన్ 14 మండలాల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గుడివాడ డివిజన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా బిళ్లపాడు పంచాయతీకి చెందిన వి.హరికృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బి.వి.రమణ, కె.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా టి.లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శులుగా సీవీఎల్‌ఆర్‌వీ ప్రసాద్, డి.సుస్మిత, కోశాధికారిగా ఐకే.సురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సరస్వతి, లక్ష్మణరావు, నరేష్, నాగరాజు, రత్నారావు తదితరులను ఎన్నుకున్నారు. ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్, ఈవోపీఆర్‌డీ ఎస్.శ్రీనివాసరావు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఆర్. కోటయ్య, రామ్మోహనరావు తదితరులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు.



గుడివాడ డివిజన్ పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గ సభ్యులు

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : పెసరమిల్లిలో వేంచేసియున్న అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మండల పూజాకార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ నిర్వహించిన 41 రోజులకు ఈ మండల పూజాకార్యక్రమాలను నిర్వాహకులచే నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయం వద్ద హోమం, పూర్ణాహుతి, హారతి కార్యక్రమాలు నిర్వహించి అన్నసమారాధన చేశారు. కార్యక్రమానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జగన్మోహనరావు, ఆలయ నిర్వాహకులు మామిడికోళ్ల సర్పంచ్ వర్రే విజయలక్ష్మి, వర్రే బలరామకృష్ణ , అల్లూరి రామశాస్త్రులు, మామిడికోళ్ల వైస్‌సర్పంచ్ తోట రాధిక, మాజీ సర్పంచ్ తోట మల్లి, వాసు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి

కొండాలమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి

గుడ్లవల్లేరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని మాజీ మంత్రి కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదివారం దర్శించుకొన్నారు. ఆలయ అర్చకులు కామినేనికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అలివేటి మండపంలో ఆలయ ఆచారం ప్రకారం కామినేని శ్రీనివాస్‌ను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్నిప్రసాదాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు బహూకరించారు. ఆదివారం అమ్మవారిని 25000 మంది భక్తులు దర్శించుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారని కొండలరావు తెలిపారు. అమ్మవారికి కమలాపురానికి చెందిన భక్తుడు తాడిశెట్టి రంగమన్నార్, భ్రమరాంబ దంపతులు రూ. 1.10 లక్షల విలువచేసే 1.10 కేజీల వెండి బిందెను అమ్మవారి కానుకగా సమర్పించారని కొండలరావు తెలిపారు.



కామినేని శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నేతలు

జూన్ 6 నుంచి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

గుడివాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాటిమీద వేంచేసియున్న భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి. గోపాలరావు తెలిపారు. ఆదివారం స్థానిక దేవస్థానంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పా ట్లు చేస్తున్నామన్నారు.



ఇబ్రహీంను పరామర్శిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

తహసీల్దార్‌కు ఎమ్మెల్యే కామినేని పరామర్శ

గుడివాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్య కారణాలతో కైకలూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహ్మద్ ఇబ్రహీం మాతృమూర్తి మృతిచెందారు. ఆదివారం స్థానిక 11వ వార్డులో జరిగిన ఆమె దశదిన(చహేలుం) కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొని ఇబ్రహీంను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బి.కె.ఎం నాని, సయ్యద్ జబీన్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కూచిపూడి, మే 25 (ఆంధ్రజ్యోతి): చినముత్తేవిలోని పొలాల్లో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.35,200ల నగదును స్వాధీనపర్చుకున్నట్టు కూచిపూడి ఎస్సై కె.నాగ విశ్వనాథం తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

కూచిపూడి, మే 25 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో మౌలిక వసతుల లేమి కారణంగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు వెంటే స్పందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మొవ్వ మండల పార్టీ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరైన రహదారులు లేకపోవటంతో పాటు డ్రెయినేజీ సౌకర్యం, విద్యుత్, తాగునీటి వసతులు నేటికీ పలు కాలనీల్లో లేని కారణంగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. మొవ్వ, పెదపూడి, కూచిపూడి, పెడసనగల్లు, కోసూరు, నిడుమోలు తదితర కాలనీల్లో సమస్యలు తిష్ట వేసినట్లు నారాయణరావు తెలిపారు.



సమస్యలు వివరిస్తున్న కాలనీ వాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

ఆటోనగర్ సమస్యలను పరిష్కరించాలి

గుడివాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్‌లో దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటోనగర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నామన్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని, కార్మికులకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, ఎం.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాగంటి సేవలు అనిర్వచనీయం

● దండమూడి జయలక్ష్మీ



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

గుడివాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య, సామాజిక సేవా రంగాల్లో ఐఎంఏ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ చేస్తున్న కృషి అనిర్వచనీయమని మానవతా స్వచ్ఛంద సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మీ అన్నారు. ఆదివారం స్థానిక మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో నెలాఖరి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డాక్టర్ మాగంటిని మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. తొలుత సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను వివరించారు. అనంతరం కొలుసు రాజా అనేవ్యక్తికి రూ.5వేలు, విద్యార్థి రాకేష్‌కు ప్రోత్సాహం నిమిత్తం రూ.5వేల చెక్కును డాక్టర్ మాగంటి అందజేశారు. అనంతరం సంస్థకు ఆయన రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖ చైర్మన్ వేణుగోపాలరావు, అధ్యక్షుడుగోపిరెడ్డి, కార్యదర్శి పద్మజ, ఉపాధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, సభ్యులు మోహనరావు, రామకృష్ణ, రాధాకృష్ణ, చిన్న, ఉదయభాస్కర రాజు, తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

విద్యుత్ కోతలతో తప్పని తిప్పలు

గుడివాడ, మే 25(ఆంధ్రజ్యోతి) : మల్లాయిపాలెంలో విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు ఆగుతుందో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు 24గంటల విద్యుత్ సరఫరా అయ్యే ఇండస్ట్రీయల్ ఫీడర్ కాని విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. శనివారం రాత్రి వర్షం పడటంతో రాత్రి 10.30 నుంచి 12గంటలకు వరకు కరెంట్ లేదు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. చౌటపల్లికి వెళ్లే రహదారి వెంబడి రాత్రి తాడిచెట్టు విద్యుత్ వైర్లపై పడటం, కొత్త చౌటపల్లి వద్ద విద్యుత్ స్థంభం ఒరిగిపోవడంతో రాత్రంతా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ



వి.ఎం రంగా, ఎస్వీ రంగారావు, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెనిగండ్ల, రాధాకృష్ణ

గుడ్లవల్లేరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : వంగవీటి మోహన రంగా పేదప్రజల గుండె చప్పుడు అని విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి గుడ్లవల్లేరులో కాపు సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని వంగవీటి రాధాకృష్ణ, ఎస్.వి రంగారావు విగ్రహాన్ని జనసేన పార్టీ బీసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర నాయకుడు పంచకర్ల సందీప్‌లు విగ్రహాలను ఆవిష్కరించారు.

కౌతవరంలో కైకాల సత్యనారాయణ విగ్రహాన్ని ఆయన తనయులు లక్ష్మీనారాయణ, కైకాల రామారావులు ఆవిష్కరించారు. తొలుత అంగలూరు గ్రామం నుంచి యువత భారీబైక్, కార్ ర్యాలీ నిర్వహించారు. విగ్రహాల ఆవిష్కరణల కార్యక్రమాల అనంతరం విజయవాడకు చెందిన ప్రముఖ న్యాయవాది పడవల ఏడుకొండలు గుడ్లవల్లేరులోని స్వగృహానికి వెళ్ళి ఆయన సోదరుడు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి రాధాకృష్ణ నివాళులర్పించారు.పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ , మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మచిలీపట్నం జనసేన ఇన్‌చార్జ్ బి.రామకృష్ణ, రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు,గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, గుడివాడ అర్బన్‌బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య ,జిల్లాపరిషత్ మాజీ వైస్‌చైర్మన్ పుష్పావతి,గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్, జగన్మోహనరావు పాల్గొన్నారు.



కైకాల సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరించిన కైకాల లక్ష్మీనారాయణ, రామారావులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి, మే 25 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. నాగ పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వివిధ సేవా రుసుముల ద్వారా ఒక్క రోజులోనే రూ.8,70,250 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.



వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు



జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో త్రికోణాసనం వేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, యోగ మాస్టర్లు

యోగాంధ్ర విజయవంతం చేయాలి

మచిలీపట్నం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమయ్యేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రామారావు సూచించారు. ఆదివారం డీఈవో కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో జరిగిన సమీక్షా సమావేశంలో రామారావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగ శిక్షణపై ప్రత్యేకమైన మార్గదర్శకాలు సూచించాయన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పెద్ద సంఖ్యలో యోగా చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఏడీ తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో యోగా శిక్షణ

జిల్లాస్థాయిలో రెండు రోజుల పాటు శిక్షణ పొందిన యోగా మాస్టార్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, మండలాల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలని జిల్లా ఆయుష్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లాపరిషత్ కన్వెన్షన్ హాలులో ఆదివారం 80 మంది వైద్య ఆరోగ్య సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు, యోగా మాస్టార్లకు జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ జాయద్ ఖాన్, డాక్టర్ పోతన శాస్త్రి, డాక్టర్ వాహిని, శ్రీనివాస్, చింతయ్య, తదితరులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, మాస్టర్ ట్రైనీలు తమ మండలాల్లో డ్వాక్రా మహిళలు, గ్రామపెద్దలు, యువకులు, విద్యార్థులకు జూన్ 20 వరకు శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. ఈ నెల 27 నుంచి ఐదు రోజుల పాటు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు మాస్టర్ ట్రైనీలు శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో ఉన్న పతంజలి, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈశా ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన యోగా మాస్టర్ల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. కనీసం 200 మందితో శిక్షణా తరగతులు ప్రారంభించాలన్నారు. 27న ర్యాలీలు నిర్వహించాలన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు యోగా శిక్షణ

కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో ఎనిమిది వేల మంది విద్యార్థులకు యోగా శిక్షణా తరగతులు చేపట్టామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎన్.ఉష పేర్కొన్నారు. విశ్వ విద్యాలయంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. యోగా మాస్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహానాడుకు భారీగా తరలి రావాలి



మచిలీపట్నం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడపలో నిర్వహించే మహానాడు పండుగకు టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎన్‌ఆర్‌ఐ గొర్రెపాటి శ్రీనివాస్ చంద్ పిలుపు నిచ్చారు. స్థానిక 45వ డివిజన్‌లో ఎన్‌ఆర్‌ఐ గొర్రెపాటి శ్రీనివాస్ చంద్‌ను డివిజన్ పార్టీ ఇన్‌చార్జి పి.వి.ఫణికుమార్, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గంజాల రవికుమార్, ప్రధాన కార్యదర్శి కొనకళ్ళ భాను ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. రూ.లక్ష కట్టిన నేపథ్యంలో పార్టీ సభ్యత్వ కార్డు మహానాడు ఆహ్వానపత్రికను ఆదివారం అందజేశారు. శ్రీనివాస్‌చంద్ మాట్లాడుతూ, మహానాడును విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



ఎన్నికైన మచిలీపట్నం డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గం

డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా పి.వి. మాధవేంద్రరావు

మచిలీపట్నం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షునిగా చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు ఎన్నికయ్యారు. మచిలీపట్నం మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో ఆదివారం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా పి.వి.మాధవేంద్రరావు, అసోసియేట్ అధ్యక్షునిగా జెఎస్‌వి పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బి.వి.సుబ్బారావు, ప్రదీప్, బి.గోవిందరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎండి షరమతుల్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జాహ్నవి, సంయుక్త కార్యదర్శులుగా రామకోటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, కోశాధికారిగా కె దినేష్ తేజతో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. మచిలీపట్నం డివిజన్ పంచాయతీ అధికారి సీతారామయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధి జిటివి రమణ, జిల్లా కోశాధికారి ఎ.కోటేశ్వరరావు, మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జె.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఉచిత న్యాయ సహాయం

● సీనియర్ న్యాయాధికారి రామకృష్ణయ్య

మచిలీపట్నం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీ మైనార్టీ మహిళలు, ట్రాన్స్‌జెండర్‌లకు, రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి సివిల్, క్రిమినల్ కేసుల్లో ఉచిత న్యాయసహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి రామకృష్ణయ్య అన్నారు. ఆదివారం ఉదయపునడక మిత్రమండలి సమావేశపు హాలులో మహిళావిభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రామకృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అల్పాదాయ వర్గాల వారికి తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయసేవలు అందిస్తున్నామన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, ఉదయపు నడక మిత్రమండలి అధ్యక్షుడు జల్దు మురళీనాధ్, కార్యదర్శి ఘంటసాల రాము, జోన్ చైర్మన్ కారుమూరి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కిషోర్‌కు నగదు అందజేస్తున్న స్నేహితులు

స్నేహితుడికి పూర్వ విద్యార్థుల సాయం

చల్లపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి ఎస్.ఆర్.వై.ఎస్.పి కళాశాలలో 1997-98 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆపదలో ఉన్న తమ స్నేహితునికి మేమున్నామంటూ అండగా నిలిచారు.

తమతోపాటు చదివిన కిషోర్ రెండు సంవత్సరాల క్రితం ప్రమాదానికి గురవ్వటంతో కాలు విరిగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నడవలేని స్థితిలో పనికి కూడా వెళ్ల లేనివిషయం తెలుసుకున్న కిషోర్ స్నేహితులు అందరూ కలిసి తమవంతుగా మొత్తం రూ.41 వేలు సమకూర్చి ఆదివారం అందజేశారు.

వెనిగళ్ల తారక జగదీష్, పులి బాబ్జి, గంజాల శ్రీను సుబ్రహ్మణ్యం, ఖాజా బాబు, కిషోర్‌లు పాల్గొన్నారు.



కార్యవర్గ సభ్యులకు మానవతా డైరీలను అందజేస్తున్న గోపీచంద్

మానవతా అధ్యక్షుడిగా కిషోర్

● కార్యదర్శిగా హసీంబేగ్ ● కో చైర్మన్‌గా నాగ రాము

మచిలీపట్నం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎవరికి ఏకష్టం వచ్చినా ఆదుకునేందుకు మానవతావాదులు ముందుకు రావాలని మచిలీపట్నం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన సలహాదారుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. స్టార్ స్కూల్‌లో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ప్రధాన సలహాదారుడు గోపీచంద్ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా జి.కిషోర్, కార్యదర్శిగా హసీంబేగ్, ఉపాధ్యక్షునిగా అయ్యప్పస్వామి, కోశాధికారిగా పిబిఆర్‌వి ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శిగా పి.వి. ఫణికుమార్ ఎన్నికయ్యారు. సంస్థ చైర్మన్‌గా మోటమర్రి బాబాప్రసాద్, కో చైర్మన్‌గా చిత్తజల్లు నాగరాము, కన్వీనర్‌గా శాస్త్రి ఎన్నికయ్యారు. బచ్చుల బోసుబాబు మరో ఆరుగురు డైరక్టర్లుగా ఎన్నికయ్యారు. గౌరవ డైరక్టర్ పి. శ్రీరాం అధ్యక్షత వహించగా, మద్దాల చింతయ్య, కారుమూరి రాజేంద్రప్రసాద్, పి.సాయికృష్ణ, ఉల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజా

అనుమానితులపై ప్రత్యేక నిఘా

● కార్డెన్ సెర్చ్‌లో డీఎస్పీ సిహెచ్ రాజా

మచిలీపట్నం టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : అనుమానితులు, పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని బందరు డీఎస్పీ సిహెచ్. రాజా అన్నారు. చిలకలపూడి పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 48 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ సిహెచ్ రాజా మాట్లాడుతూ, మద్యం అక్రమ రవాణా నివారణ, మాదక ద్రవ్యాలు, గంజాయి నియంత్రణ కోసం తనిఖీలు నిర్వహించామన్నారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ద్విచక్ర వాహనాలు వినియోగించే వారిని, పాత కేసుల్లో నిందితులను గుర్తించి, నేర నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తారసపడితే వారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. వంద మంది సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారన్నారు. అనుమానితులు ఎవరైనా తారసపడితే పోలీసులకు వెంటనే తెలియజేయాలన్నారు.

సందర్శకుల రాకతో సాగరతీరంలో సందడి



కోడూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి బీచ్ వద్దకు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు రావటంతో సాగరతీరం కళకళలాడింది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అనేక మంది సందర్శకులు బీచ్ వద్ద స్నానాలు చేసి తీరం వెంబడి ఇసుక తిన్నెలలో కుటుంబ సమేతంగా సరదాగా గడిపారు. తీరం వెంబడి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మెరైన్ పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు.

బాలాత్రిపుర సుందరీదేవికి లక్ష మల్లెల అర్చన




చల్లపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : నడకుదురు పృథ్వీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరీ దేవి అమ్మవారికి లక్ష మల్లెల అర్చన జరిగింది. అర్చకులు కంఠం రాజు గణపతి దీక్షితు లు (సాయిబాబు శర్మ) పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బాలా త్రిపుర సుందరి అమ్మవారికి మహాస్నపన, అలంకరణ చేశారు. లలితా సహస్రనామ పారాయణం అనంతరం మల్లె పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం 200 మంది భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. గ్రామ పెద్దలు నాదెళ్ళ త్రివిక్రమరావు, విశ్రాంత ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణలు పర్యవేక్షించారు.



ఘనంగా అంకమ్మ తల్లి జాతర

మోపిదేవి, మే 25 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలో కొండేటి వారి అంకమ్మ తల్లి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మోపిదేవి వార్పు వద్ద కృష్ణానదికి తీసుకెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. డప్పుకళాకారుల విన్యాసాలు, యువతీ, యువకుల సందడి నడుమ ఊరేగింపుగా గ్రామానికి అమ్మవారు తరలివచ్చారు. రావివారిపాలెంలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



నీలారమ్మ వార్షిక సంబరం

ఘంటసాల, మే 25 (ఆంధ్రజ్యోతి) : సూరపనేనివారిపాలెంలో నీలారమ్మ అమ్మవారి 15వ వార్షిక సంబరం తమ్మనబోయిన శ్రీరాములు - శివపార్వతి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి శ్రీరాములు దంపతులు, ఆత్మకూరి జయ కిషోర్ - వీర నాగ భవాని దంపతులు, తమ్మనబోయిన నీలిమ రాణి, తన్విశ్రీ, స్నిగ్ధ శ్రీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు 20 మందిని శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. తమ్మనబోయిన శ్రీరాములు - శివపార్వతీ దంపతుల ఆధ్వర్యంలో 500 మందికి అన్నసమారాధన నిర్వహించారు.



రేణుక మావూరమ్మ సేవలో విక్కుర్తి

అవనిగడ్డ, మే 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేటలో కొలువుతీరిన రేణుక మావూరమ్మను పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. భూపతి వారి ఇలవేల్పు రేణుక మావూరమ్మ జాతర మహోత్సవాలు గురువారం ఆదివారం ప్రారంభం కాగా, విక్కుర్తి శ్రీనివాసరావు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు విక్కుర్తిని ఘనంగా సత్కరించారు. విక్కుర్తి రాంబాబు, న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, భూపతి నాంచారయ్య, రేపల్లె మునలయ్య, రేపల్లె ఈశ్వరరావు, బర్మా బుజ్జి, రేపల్లె ప్రతాప్, బర్మా శ్రీనివాసరావు, భూపతి సాంబశివరావు, భూపతి రమణ, భూపతి రవీంద్ర, భూపతి బాబురావు, భూపతి బాల అబ్బాయి పాల్గొన్నారు.



విజయ అమలేశ్వరికి పూజలు

పెడన రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : దావోజీపాలెంలో అంకెం వారి ఇలవేల్పు విజయ అమలేశ్వరిదేవి సంబరాలు నాల్గో రోజు వైభవంగా జరిగాయి. భక్తులు ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. ఏకాదశ క్రతువులో భాగంగా ఆదివారం గురునాథ పూజ, ఊరేగింపు నిర్వహించారు.

సేవాతత్పరుడు మల్లయ్య

నాగాయలంక, మే 25 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఎ.ఎల్.మల్లయ్య చేసిన సేవలు అజరామరమని మత్స్యకార నేతలు అన్నారు. నాగాయలంకలోని మత్స్య భవనం వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల హక్కు రక్ష సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏపీ మత్స్యకారుల ఫెడరేషన్ తొలి చైర్మన్ ఎ.ఎల్.మల్లయ్య 87వ జయంతిని నిర్వహించారు. మత్స్యకారుల సంక్షేమానికి మల్లయ్య చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని నేతలు పేర్కొన్నారు. లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, నాగిడి తాతారావు, లంకే శ్రీనివాస ప్రసాద్, కె.నరసింహారావు, వాడపల్లి బిక్షం, సందడి గొందియ్య పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పాకలపాటి రాము బ్రహ్మత్వంలో సనకా శ్రీనివాసరావు - ఉదయలక్ష్మి దంపతులు కల్యాణం చేశారు. మూర్తి వెంకట సుబ్రహ్మణ్యం దంపతుల సాయంతో అన్నదానం జరిగింది. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అవనిగడ్డ గ్రంథాలయాధికారి ప్రభుదాసు మృతి



అవనిగడ్డ, మే 25 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అవనిగడ్డ గ్రంథాలయాధికారి జుజ్జువరపు ప్రభుదాసు ఆదివారం మృతి చెందారు. అవనిగడ్డ గ్రంథపాఠకుల సంఘం ప్రతినిధులు సింహాద్రి రామలింగేశ్వరరావు, లుక్కా. ప్రతాప్, సురేంద్ర, బండి కృష్ణారావు, వీరకుమారి, సాహితీ వేత్తలు గుడిసేవ విష్ణు ప్రసాద్, సింహాద్రి పద్మ, దివి ర్యూన్సీ విద్యార్థిని విద్యార్థులు ప్రభుదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోజురోజుకూ కుంగిపోతున్న కోడూరు ప్రధాన రహదారి

కోడూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ దశలోనే రోజు రోజుకి కుంగిపోతోంది. కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి పూర్తిగా పాడవ్వటంతో 13 కిలోమీటర్ల రహదారి నిర్మాణం రూ.16 కోట్ల 80 లక్షలతో గత సంవత్సరం చేపట్టారు. ఇప్పటి వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం పూర్తి చేశారు. మిగిలి ఉన్న ఐదు కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తి కాకముందే జయపురం - కొత్తపాలెం గ్రామాల మధ్య పంట కాలువలోకి రహదారి కుంగిపోవటంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కుంగిపోతున్న ప్రదేశంలో రిటెన్‌మెంట్ వాల్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



లంకమ్మ సేవలో భక్తులు

అవనిగడ్డ, మే 25 (ఆంధ్రజ్యోతి) : దివి ప్రజల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మెడలో గారెలు దండ, నెత్తి మీద ఘటం బిందెలు పెట్టుకుని రంగులు చల్లుకుంటూ డప్పువాయిద్యాలు, కోలాటాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా

అవనిగడ్డ, మే 25 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ నియంత్రణ, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుడివాడకి చెందిన ఎం.శేఖర్ బాబు, బృందం కళాకారులు వీధి నాటిక ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు ఎయిడ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఐసీటీసీ సెంటర్లు, ఏఆర్‌టీ మందులు, పీపీటీసీ కేంద్రాలు, మొబైల్ ఐసీటీసీ కేంద్రాలు, రక్తదానం తదితర అంశాలను ప్రజలకు వివరించారు.